సాక్షి
ప్రకాశం
సోమవారం ၊ 2 ၊ డిసెంబర్ ၊ 2024



ఖోఖో కింగ్స్!

కనిగిరి మండలం కంచర్లవారిపల్లి హైస్కూల్ విద్యార్థులు ఖోఖోలో సత్తా చాటుతున్నారు. 15 మంది విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

- 8లో..



విదేశీ పక్షుల సందడి

కంభం మండలం తురిమెళ్ల చెరువులో విదేశీ పక్షులు సందడి చేస్తున్నాయి. బార్ హెడ్ గూస్ పక్షులు పెద్ద సంఖ్యలో ఇక్కడకు తరలి వచ్చాయి.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
29/24

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి పోటీలకు మార్కాపురం విద్యార్థిని



సౌజన్యను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి, పీడీ ఉమాదేవి

మార్కాపురం: ఇటీవల అనంతపురంలో నిర్వహించిన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ లో రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మార్కాపురం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని తంగిరాల సౌజన్య రజత పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో సౌజన్యను హెచ్‌ఎం ఈ శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్ ఉమాదేవి అభినందించారు. భవిష్యత్తులో పాఠశాలకు మంచిపేరు తేవాలని సూచించారు.

ఆరోగ్యకరమైన పోటీ ఉండాలి

- రాష్ట్ర నాయకులు మాంటిస్సోరి ప్రకాష్



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు మాంటిస్సోరి ప్రకాష్

ఒంగోలు సిటీ: ప్రైవేటు విద్యాసంస్థల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని రాష్ట్ర నాయకుడు మాంటిస్సోరి ప్రకాష్ అన్నారు. స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ట్యూటోరియల్స్ అండ్ కాన్వెంట్స్ అసోసియేషన్ జిల్లా, పట్టణ శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న మెరిట్ విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచి మారిన కొత్త సిలబస్, పరీక్షల విధానంలో వారు తెలుసుకోవాల్సిన మెళుకువలను తెలియజెప్పేందుకు అనుభవజ్ఞులైన ప్రభుత్వ ఉపాధ్యాయులచే ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ఉండి విద్యార్థుల నైపుణ్యాలు పెంచే ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలన్నారు. కృష్ణసాయి రైజ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సిద్దా భరత్, జిల్లా అధ్యక్షుడు జాలిరెడ్డి, రైజ్ కాలేజీ యాజమాన్యం సిద్దా భరత్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫిజిక్స్ ఫ్యాకల్టీగా రవికాంత్, ఇంగ్లిష్‌కు హనుమంతరావు, హిందీకి సతీష్, సోషల్‌కు రాధాకృష్ణ ఫ్యాకల్టీగా వ్యవహరించారు. ఏపీటీసీఏ పట్టణ అధ్యక్షులు జీవీవీ లక్ష్మి, సెక్రటరీ శ్రీనివాసరావు, పూర్వ అధ్యక్షుడు రామిరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

బడి వేళలు భారం

ప్రభుత్వ పాఠశాలల్లో పనివేళల పెంపు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు భారంగా మారాయి. గతంలో ఉన్న సమయానికన్నా ఒక గంట అదనంగా పెంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు వారిని ఇక్కట్లకు గురిచేస్తున్నాయి. హైస్కూళ్లకు దూర ప్రాంతాల్లో ఉన్న మారుమూల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థినులు చీకటి పడే వేళ సరైన రవాణా సౌకర్యాలు లేక బిక్కుబిక్కుమంటూ నానా అగచాట్లు పడి ఇళ్లకు చేరుతున్నారు. పనివేళల పెంపుతో ఉపాధ్యాయుల్లోనూ అసంతృప్తి వ్యక్తమవుతోంది.

- బడి వేళల పెంపు.. అయ్యవార్ల పెదవి విరుపు..
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు
- విద్యార్థులపై శారీరక, మానసిక ఒత్తిడి
- దూరం నుంచి వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు



రామచంద్రకోటలో బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థినులు

పెద్దదోర్నాల మండలంలోని రామచంద్రకోట జెడ్పీ హైస్కూల్ లో మొత్తం 216 మంది విద్యార్థులున్నారు. హైస్కూల్‌కు చుట్టు పక్కల గ్రామాలైన చింతల అగ్రహారం, కటకానిపల్లె, చిన్న దోర్నాల నుంచి ప్రాంతాల నుంచి విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాలకు వస్తున్నారు. ఈ పాఠశాలకు చింతల అగ్రహారం రెండు కిలోమీటర్లు, కటకానిపల్లె మూడు కిలోమీటర్లు, చిన్న దోర్నాల ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఈ పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఆర్టీసీ బస్సులు, సైకిల్ పైన, నడిచివెళ్లే వారు ఉన్నారు. ఈ పాఠశాలను సాయంత్రం ఐదు గంటలకు వదిలినప్పుడు బస్సు 5.40 గంటలకు వస్తుంది. అప్పటిదాకా రోడ్డుపై విద్యార్థులు పడిగాపులు కాయాలి. నడిచి, సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు చీకటిపడే సమయంలో భయంభయంగా వెళ్లాల్సి వస్తోంది.



రామచంద్రకోట హైస్కూల్ అనంతరం గ్రామాలకు సైకిళ్ల పై వెళుతున్న విద్యార్థినులు

ఒంగోలు సిటీ:

ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్న సంస్కరణలతో గత ప్రభుత్వం వాటికి జీవంపోస్తే.. కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో వాటిని కునారిల్లేలా చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 440 ఉన్నత పాఠశాల్లో 1,22,000 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో సుమారు 6700 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. గతంలో పాఠశాల పనివేళలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రకరకాల శిక్షణల పేరుతో ఉపాధ్యాయుల సమయాన్ని హరించి.. సిలబస్ పూర్తికావడంలేదన్న సాకుతో పనివేళలు పెంచి అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులపైనా భారం మోపుతోంది. తొలి విడతగా మండలానికి ఒకటి చొప్పున ఒక ఉన్నత పాఠశాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకుని జిల్లాలోని 38 పాఠశాలల పనివేళలు ఒక గంట పాటు పెంచింది. గత నెల 1వ తేదీ నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పాఠశాలలు సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులపై శారీరక, మానసిక ఒత్తిడి:

ఇప్పటికే సిలబస్ పూర్తి కాలేదని ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. అందుకు కారణం శిక్షణల పేరుతో ఉపాధ్యాయులను వేధించడమే. దీంతో ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడే కాకుండా విద్యార్థులపై కూడా భారం పడుతోంది. చాలా పాఠశాలలకు మారుమూల గ్రామాల నుంచి చదువుకోవడానికి విద్యార్థినీ విద్యార్థులు వస్తున్నారు. కొన్ని గ్రామాలకు సరైన రవాణా సౌకర్యం, రోడ్లు లేక ఇబ్బందులు పడుతూ ఆలస్యంగా వస్తున్నారు. ఇప్పుడు పాఠశాలల పనివేళలు పెరిగితే సాయంత్రం ఇంటికి చేరుకోవడానికి ఇంకా ఇబ్బందిగా ఉంటుంది. చాలా వరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆర్టీసీ బస్సులపై ఆధారపడి వస్తుంటారు. కొన్ని చోట్ల సాయంత్రం 6 గంటల వరకు కూడా బస్సులు రాక వాటికోసం రోడ్డుపై పడిగాపులు కాసి చీకటిపడే వేళకు ఇళ్లకు చేరుకుంటున్నారు. ఆటోల్లో వెళ్లే వారి పరిస్థితి కూడా అంతే. దీంతో ఆడపిల్లల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పసిపిల్లలు, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా లైంగికదాడులు పెరిగిపోయాయి. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంటికి చేరేదాకా భయంభయంగా గడుపుతున్నారు.



పాఠశాల అనంతరం వారి గ్రామాలకు నడిచి వెళుతున్న విద్యార్థులు

■ మార్కాపురం మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో 6 నుంచి 10 వ తరగతి వరకు మొత్తం 1143 మంది విద్యార్థులున్నారు. ఈ పాఠశాలకు గొట్టిపడియ, జమ్మలపల్లి, కోళ్ల భూములపాడు, శివరాంపురం, కొండేపల్లి, కొత్తపల్లి, చింతల అగ్రహారం, మొద్దులపల్లి తదితర 16 గ్రామాల నుంచి విద్యార్థులు బస్సులు, ఆటోల్లో రాకపోకలు సాగిస్తున్నారు. సాయంత్రం ఐదు గంటలకి పాఠశాల ముగియటంతో దూర ప్రాంతాలు వెళ్లే వారికి ఆ సమయంలో బస్సు దొరక్క ఇబ్బందిగా ఉంది.

■ తర్లుపాడు మండలంలోని తుమ్మలచెరువు జెడ్పీ పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా కేటాయించారు. పాఠశాలలో మొత్తం 310 మంది విద్యార్థులున్నారు. విద్యార్థులు చుట్టు పక్కల గ్రామాలైన బుడ్డపల్లి, జగన్నాథపురం, సూరేపల్లి గ్రామాల నుంచి మూడు కిలోమీటర్లు కాలినడకన పాఠశాలలకు చేరుకుంటున్నారు. సాయంత్రం చీకటిపడేవేళ అంత దూరం నడిచి వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

■ పొదిలి మండలంలోని ఉప్పలపాడు ఉన్నత హైస్కూల్ లో మొత్తం 370 మంది విద్యార్థులున్నారు. ఈ పాఠశాలకు గోగినేని వారిపాలెం, ఉప్పలపాడు, ఏలూరు, టీ సల్లూరు, తలమల్ల, అగ్రహారం, తీగదుర్తిపాడు, అన్నవరం గ్రామాల నుంచి విద్యార్థులు బస్సులో, ఆటోల్లో రాకపోకలు సాగిస్తున్నారు. సాయంత్రం ఐదు గంటలకి పాఠశాల ముగియటంతో దూర ప్రాంతాలు వెళ్లే వారికి బస్సు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు.

ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం..

అభివృద్ధి చెందిన దేశాల్లో పాఠశాలలు రోజుకు ఆరు గంటలు మాత్రమే పనిచేస్తున్నాయి. కానీ ప్రభుత్వ ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో పాఠశాలల పనివేళలను పెంచుతూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఉన్న పనివేళలు సహేతుకంగా ఉన్నాయని, వాటినే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నాయి.

స్టడీ అవర్స్ మిస్ అవుతున్నాం



నేను మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. గొట్టిపడియ నుంచి మార్కాపురానికి 16 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మా ఊరు గొట్టిపడియకు బస్సు 8.30 గంటలకు వస్తుంది. అక్కడక్కడా గ్రామాల్లో ఆగుతూ ఒక్కోసారి 9.30 గంటలకు, 9.45 గంటలకు బస్సు మార్కాపురానికి వస్తుంది. పాఠశాలకు రావడానికి ఆలస్యం అవుతోంది. దాని వల్ల స్టడీ అవర్స్ మిస్ అవడమే కాకుండా పెంచిన సమయాల వల్ల ఇబ్బందులు పడుతున్నాం. ఇంటికి వెళ్లేటప్పుడు కూడా సమయానికి బస్సులు ఉండవు.

– బి.కోదండ, తొమ్మిదో తరగతి, గొట్టిపడియ

పాత సమయాలనే కొనసాగించాలి



గతంలో అమలులో ఉన్న సమయాలు అందరికీ అనుకూలంగా ఉన్నాయి. చలికాలంలో సాయంత్రం ఐదున్నర గంటలకే చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఈ సమయంలో స్కూల్ వదిలిన తర్వాత వేరే ఊరు నుంచి వచ్చే బాలికలు ఇంటికి చేరాలంటే అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. వారి తల్లిదండ్రులు పిల్లలు ఇంటికి చేరేదాకా ఆందోళన చెందుతారు. ప్రభుత్వ విద్యాశాఖ అనాలోచిత నిర్ణయంతో విద్యార్థినుల భద్రత, భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతోంది. ఎప్పుడో పన్నెండింటికి భోజనం చేసిన పిల్లలు సాయంత్రం ఆరు గంటల వరకు ఏమీ తినకుండా ఉండాలంటే ఇబ్బంది పడతారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పకుండా బోధనకే పరిమితం చేస్తే ప్రస్తుత స్కూల్ సమయాలు సరిపోతాయి. ప్రభుత్వం విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా పాఠశాలల పనిగంటలు పెంచే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– బి.అశోక్‌కుమార్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఒంగోలు.

ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం



బడివేళల పెంపుపై ప్రభుత్వ అధికారులు ఎవరితో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నాం. శాస్త్రీయంగా విద్యార్థికి ఎంత సమయం అవసరమో, ఈ విషయంపై సైకాలజిస్టులు, మేధావులు, సంఘ నాయకులతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని యూటీఎఫ్ కోరుతోంది. ఉన్నత పాఠశాలల్లో సమయం పెంచడాన్ని మేము వ్యతిరేకిస్తున్నాం. పాత సమయాన్నే కొనసాగించాలని యూటీఎఫ్ డిమాండ్ చేస్తోంది.

– షేక్ అబ్దుల్ హై, యూటీఎఫ్, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు



గిద్దలూరులో ఆటోలో వెళ్లడానికి ఆటో వద్ద వేచివున్న విద్యార్థినులు

గిద్దలూరు నగర పంచాయతీలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు విద్యార్థినులు తరచూ ఆటోల్లో వస్తుంటారు. ఈ పాఠశాలకు చెట్టిరెడ్డిపల్లి, మిట్టమీద పల్లె, అంబవరం, వెళ్లపల్లె, కొండపేట గ్రామాల నుంచి విద్యార్థినులు ఆటోల్లో రాకపోకలు సాగిస్తున్నారు. సాయంత్రం ఇళ్లకు వెళ్లేటప్పుడు భయం భయంగా వెళ్లాల్సి వస్తోంది.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చుండూరు రవిబాబు

- విద్యుత్ చార్జీలు, ట్రూఅప్ లతో ప్రజలపై భారాన్ని మోపారు
- పెరిగిన నిత్యావసరాల ధరలతో లబోదిబోమంటున్న ప్రజలు
- ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: ఎన్నికల ముందు చార్జీలు పెంచనని ప్రజలకు వాగ్దానం చేసిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో రెండుసార్లు ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం వేస్తూ ప్రజలను మోసం చేయడంలో బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరు రవిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలపై రూ.15,485.36 కోట్ల భారాన్ని మోపిందని విమర్శించారు. విద్యుత్ చార్జీలు, ట్రూఅప్‌ల పేరుతో చంద్రబాబు బాదుడే బాదుడు కార్యక్రమాన్ని మొదలుపెట్టారని ధ్వజమెత్తారు. నయవంచనకు చంద్రబాబు పెట్టింది పేరన్నారు. సూపర్‌సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తన మార్కు నయవంచనతో హామీలకు తూట్లు పొడుస్తూ ప్రజలను దెబ్బతీశారన్నారు. ఎన్నికల ప్రచారంలో విద్యుత్ చార్జీలు అసలు పెంచమబోమని, ట్రూఅప్ చార్జీలు ఎత్తేస్తామని చెప్పిన చంద్రబాబు .. నేడు ఏ హామీ ఇవ్వలేదని నిస్సిగ్గుగా చెబుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రూ.9,412.50 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీలను ప్రజల నుంచి వసూలుకు శ్రీకారం చుట్టనుందన్నారు. ప్రజలపై ప్రతి యూనిట్‌కు రూ.0.92 అదనపు భారం పడుతుందన్నారు. ప్రజలపై పడిన అదనపు భారాన్ని వచ్చే ఏడాది జనవరి నుంచే వసూలు చేసేందుకు ఏపీఈఆర్‌సీ ఆమోదం కూడా తెలిపిందన్నారు. దీపావళి పండుగకే ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై రూ.6072.86 కోట్ల భారం వేసిందని విమర్శించారు. వినియోగదారుల నుంచి ప్రస్తుతం రూ.1.27 చొప్పున నవంబరు నుంచి వసూలు చేశారని, ప్రస్తుత చార్జీలతో కలిపి జనవరి నుంచి యూనిట్‌కు రూ.2.19 లను అదనంగా వినియోగదారులు చెల్లించాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఈ ఐదు నెలల కాలంలో రూ.15,485.36 కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందని విమర్శించారు. 2023-2024 సంవత్సరానికి రూ.12,844.88 కోట్ల సర్దుబాటు చార్జీల వసూలుకు డిస్కంలు ఏపీఈఆర్‌సీ కి ప్రతిపాదనలు సమర్పించాయని తెలిపారు. 2014-19 మధ్యకాలంలో అధికారంలో ఉన్న చంద్రబాబు అవసరం లేకపోయినా పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ) లను అధిక ధరలకు చంద్రబాబు కుదుర్చుకున్నారన్నారు. 3494 మెగావాట్ల విండ్ పీపీఏ లకు సంబంధించి యూనిట్ ధర రూ.4.94 అయితే సెకీతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ధర రూ.2.49 అని, చంద్రబాబు ఒప్పందం వల్ల ఒక్కో యూనిట్‌కు ధర రూ.2.35 చొప్పున ప్రతి ఏటా రూ.2 వేల కోట్లు అదనపు భారం పడుతోందన్నారు. సౌర విద్యుత్ ఒప్పందాల్లో చంద్రబాబు ప్రభుత్వం 2400 మెగావాట్ల కోసం చేసుకున్న ఒప్పందం ప్రకారం ఏటా రూ.1500 కోట్ల అదనపు భారం పడుతోందని, వైఎస్సార్‌సీపీ చేసుకున్న విద్యుత్ ఒప్పందం వల్ల 25 ఏళ్లలో రూ.1.10 లక్షల కోట్లు ఆదా అవుతుందని చెప్పారు. డిస్కంలను అప్పుల్లోకి తీసుకెళ్లిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే కూటమి ప్రభుత్వంలో పప్పు దినుసులు, కూరగాయలు, బియ్యం రేట్లు విపరీతంగా పెరిగిపోయాయని విమర్శించారు. ఉచితంగా ఇసుక ఇస్తామన్నా రేట్లు సామాన్యుడికి అందకుండా పోయిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సామాన్యుడు బతికే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. సమావేశంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, జిల్లా స్పెషల్ టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జ్ కె.వి.రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బొట్ల సుబ్బారావు, కఠారి ప్రసాద్, చావలి శివ, కోటియాదవ్, ఫణిదపు సుధాకర్, మీరావలి, పి.వెంకయ్యనాయుడు, కాశిరెడ్డి, రవీంద్రరెడ్డి, బడుగు ఇందిర, పులుసు సురేష్‌బాబు, కమ్మ సురేష్, మల్లిశెట్టి దేవ, ఇమ్రాన్‌ఖాన్ పాల్గొన్నారు.

దాహమో.. జనార్దనా..

- ఎనిమిది రోజులుగా రక్షిత మంచినీరు రాక నగర ప్రజలు విలవిల
- రోజుల తరబడి పైప్‌లైన్ల మరమ్మతుల పేరిట కాలయాపన
- రెండు లక్షల మంది ప్రజలకు నీళ్లు సరఫరా చేయని నగరపాలక సంస్థ
- నిత్యావసరాలకు నీళ్లు లేక అల్లాడుతున్న జనం
- ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయని అధికారులు



భాగ్యనగర్ 4వ లైన్‌లో నర్సింగ్ కాలేజీకి పోయే రోడ్డులో అడ్డంగా తవ్విన గొయ్యి

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర ప్రజలకు ఎనిమిది రోజులుగా నగర పాలక సంస్థ రక్షిత మంచినీటిని విడుదల చేయటం లేదు. నగరంలోని ప్రజలకు కొత్త మంచినీటి కనెక్షన్లు ఇస్తున్నాం... అందుకోసం మంచినీటి పైపు లైన్ల మరమ్మతులు చేస్తున్నామని గతనెల 23వ తేదీ ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఆ మేరకు 25 నుంచి 28వ తేదీ వరకు మంచినీటి సరఫరా నిలిపేస్తున్నామని ఏరియాల వారీగా ప్రకటించారు. అయితే 1వ తేదీ దాటినా ఇంత వరకు వరకు మంచినీటి ఊసేలేదు. దాంతో ఒంగోలు నగర ప్రజలు అవస్థలు పడుతున్నారు.

రోజుల తరబడి మరమ్మతులు:

ఒంగోలు నగరంలోఎస్‌ఎస్ ట్యాంకుల నుంచి నీరు విడుదల చేసేందుకు కొత్త మంచినీటి కనెక్షన్లు ఇచ్చేందుకుగాను భాగ్యనగర్ నాలుగో లైన్‌లోని మంచినీటి పైపులైన్ (ప్రధాన లైను)కు మరమ్మతులు చేపట్టారు. నగరంలోని అనేక ప్రాంతాలకు ఈ పైపులైన్ నుంచే మంచినీటి సరఫరా అవుతోంది. కొత్తగా వేసిన పైపులైన్లకు ఇంటర్ కనెక్షన్ చేస్తుండటంతో నీటి సరఫరా నిలిపేశారు. దీంతో భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు, విజయ నగర్ కాలనీ, ధారావారి తోట, రామ్ నగర్, అంబేడ్కర్ నగర్, అన్నవరప్పాడు, సంతపేట, పోతురాజుపాలెం, కబాడిపాలెం, మిరియాల పాలెం, చివుకుల వారి వీధి, కొప్పోలు, బందావన్ నగర్, డ్రీమ్స్ స్కూలు రోడ్డు, ఇందిరమ్మ కాలనీ, పులివెంకట రెడ్డి కాలనీ, రాజీవ్ గృహకల్ప, గుర్రం జాషువా కాలనీ, గోపాల్ నగర్ ఎక్స్‌టెన్షన్, బలరాం కాలనీ, కేశవరాజు కుంట, చిన మల్లేశ్వర కాలనీ, కరుణ కాలనీ, కబేళా రోడ్డు, గద్దలగుంట, రాజీవ్ నగర్, సుందర్ నగర్, మామిడి పాలెం, గాంధీ నగర్, కొత్తడొంక, జెడ్పీ కాలనీ, మిలిటరీ కాలనీ, శివాజీ కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, దిబ్బల రోడ్డు, సత్యనారాయణపురం, ఇందిరా నగర్, వెంకటేశ్వర కాలనీ, నెహ్రూ నగర్ ఎక్స్‌టెన్షన్, జయ ప్రకాష్ కాలనీ ప్రజలకు నీటి సరఫరా నిలిచిపోయింది.

నగరంలో 2 లక్షల మందికి పైగా ప్రజలు నీళ్లు లేక అవస్థలు...

ఒంగోలు నగరంలో దాదాపు 3 లక్షల కు పైగా జనాభా ఉన్నారు. ప్రస్తుతం మంచినీటి పైపు లైన్‌కు మరమ్మతులు చేపట్టడంతో దాదాపు 2 లక్షల మందికి నీటి సరఫరా ఆగిపోయింది. పైప్‌లైన్‌లో ప్రధాన సమస్యను కనుగొన్న నగర పాలక సంస్థ అధికారులు పరిష్కారానికి వచ్చే సరికి సకాలంలో పూర్తి చేయలేక చేతులెత్తేశారు. మరమ్మతుల పేరిట కాలయాపన చేస్తూ కాలం గడుపుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు శూన్యం...

ఎనిమిది రోజులుగా నగర ప్రజలకు నీళ్లు ఇవ్వలేని అధికారులు కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయలేదు. రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా నీళ్లు తోలుతున్నామని, నగర శివారు ప్రజల నీటి అవసరాలు తీరుస్తున్నామని అధికారులు చెబుతున్నా.. వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఇన్ని రోజులుగా ప్రజలకు కనీసం ఒక్క ట్రాక్టర్ ట్యాంకరు అయినా పంపించలేదు.

ఎమ్మెల్యే మెప్పు కోసమే అధికారుల పాట్లు:


ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మెప్పు కోసం మాత్రమే పనిచేస్తున్నారు. ప్రధానంగా నగర పాలక సంస్థలోని ఇంజినీరింగ్ అధికారుల తీరు మరీ దారుణం. బదిలీలు ఆపుకోవటానికి, పదోన్నతులు పొందటానికి మాత్రమే పనిచేస్తున్నట్లు ఉంది. లేకుంటే ఎనిమిది రోజులుగా మంచినీళ్లు ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఇంజినీరింగ్ అధికారులు మాత్రం ఎమ్మెల్యే జనార్దన్ మెప్పు పొందటానికి ఆయన నివాసం ఉంటున్న బీకే అపార్ట్‌మెంట్ ముందు ఆహ్లాదకరంగా ఉండేందుకు వర్క్ మంజూరు కాకుండానే, నిధులు రాకుండానే ఇనుప నెమలి బొమ్మ ఏర్పాటు చేశారు. కానీ ఎనిమిది రోజులుగా ఇబ్బందులు పడుతున్న నగర ప్రజల అవస్థలు మాత్రం అధికారులకు పట్టడం లేదు. ఎమ్మెల్యే జనార్దన్ కూడా నగర పాలక సంస్థ అధికారులపై పట్టు కోల్పోయి ప్రజల అవస్థలను గాలికి వదిలేశారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. ఇన్ని రోజులుగా మంచినీటి సరఫరా లేకపోయినా ఎమ్మెల్యే జనార్దన్ అధికారులతో కనీస సమీక్ష కూడా చేయలేదని జనం మండిపడుతున్నారు.



మీటరు లేకుండా నేరుగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అక్రమంగా విద్యుత్‌ను వాడుకుంటున్న నగర పాలక సంస్థ అధికారులు

అక్రమంగా విద్యుత్ వినియోగం:

మంచినీటి పైపులైన్ల మరమ్మతుల పేరిట నగర పాలక సంస్థ అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. మరమ్మతు పనులకు విద్యుత్ అవసరం. నేరుగా విద్యుత్ లైన్లను విద్యుత్ సరఫరా తీసుకోవాలంటే విద్యుత్ సంస్థ అనుమతి తీసుకొని ప్రత్యేకంగా మీటర్లు ఏర్పాటు చేసుకోవాలి. ఎన్ని యూనిట్లు వాడుకుంటే అన్ని యూనిట్లకు బిల్లు చెల్లించాలి. ఆ నిబంధనకు నీళ్లు వదిలిన నగర పాలక సంస్థ అధికారులు నేరుగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా తీసుకొని యథేచ్ఛగా ఇంజిన్లు, జనరేటర్లు వాడుకొని నిబంధనలను అతిక్రమించారు.



అక్రమంగా తీసుకున్న విద్యుత్ ద్వారా జనరేటర్లను నడుపుతున్న దృశ్యం

శాశ్వత పరిష్కారం కోసం పనులు చేస్తున్నాం...

నగర ప్రజల మంచినీటి అవసరాలు తీర్చేందుకు శాశ్వత పరిష్కారం కోసం పనులు చేపట్టాం. నాలుగు రోజుల్లో పనులు పూర్తి చేద్దామనుకున్నాం. అయితే భూమిలోని మంచినీటి పైపులు ఎక్కువగా దెబ్బతినటం వల్ల అధికంగా మార్చాల్సి వచ్చింది. మంచినీటి సరఫరా కాని ప్రాంతాలకు ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నాం. మరో రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో సమస్య పరిష్కారం అవుతుంది. ప్రజలు సహకరించాలని కోరుకుంటున్నాం.

– డాక్టర్ కోదూరి వెంకటేశ్వర రావు, నగర కమిషనర్

క్లుప్తంగా

భారీ కొండచిలువ కలకలం

● గ్రామస్తుల సహకారంలో అటవీ ప్రాంతంలో వదిలిన స్నేక్ క్యాచర్...



బోడేనాయక్ తాండాలో పట్టుకున్న కొండచిలువ

పెద్దదోర్నాల: జనావాసాల్లోకి వచ్చిన ఓ భారీ కొండచిలువ గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేసింది. ఈ సంఘటన మండల పరిధిలోని శ్రీశైలం రహదారిలో ఉన్న బోడేనాయక్ తాండాలో ఆదివారం జరిగింది. హడలిపోయిన తాండా వాసులు అటవీశాఖ అధికారులకు సమాచారమందించారు. అధికారులు మార్కాపురంలోని స్నేక్‌క్యాచర్ నిరంజన్‌కు సమాచారమందించారు. దీంతో హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకున్న స్నేక్ క్యాచర్ నిరంజన్ చాకచక్యంగా కొండచిలువను పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. గత కొన్ని రోజులుగా పరిసర ప్రాంతాల్లో కనిపిస్తూ మాయమవుతున్న కొండ చిలువ ఆదివారం గ్రామంలోని రామాలయం వద్ద నున్న వీధిలో ప్రత్యక్షమైంది. దీంతో కొండచిలువ ఎటూ వెళ్లకుండా గంటన్నర పాటు నిలువరించిన గ్రామస్తులు స్నేక్ క్యాచర్ వచ్చి దాన్ని పట్టుకోవటంలో ఊపిరి పీల్చుకున్నారు. పట్టుకున్న కొండచిలవ పొడవు సుమారుగా 8 అడుగులు ఉంటుందని స్నేక్ క్యాచర్ నిరంజన్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని అలవాటు చేయాలి

● జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు

ఒంగోలు సబర్బన్: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి గ్రామంలోని రైతులకు అలవరచాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ శిక్షణ కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణా కార్యక్రమానికి ఆయన ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఆచరిస్తున్న 9 సార్వత్రిక సూత్రాల గురించి వివరించారు. పలు పంటల్లో పాటిస్తున్న పద్ధతులు, వాటి విధివిధానాల గురించి విపులీకరించారు. ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది వ్యవసాయ శాఖతో అనుసంధానంగా పనిచేయాలని ఆయన సూచించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ వి.సుభాషిణి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పురుగుమందుల అవశేషాలు లేకుండా పంటలు పండించటమే ధ్యేయంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

తురిమెళ్ల చెరువులో విదేశీ పక్షుల సందడి



బార్‌హెడె గూస్ పక్షి

కంభం: మండలంలోని తురిమెళ్ల గ్రామంలోని చెరువులో విదేశీ పక్షులు సందడి చేస్తున్నాయి. ఒక్క రోజులో ఆగకుండా 1600 కిలోమీటర్లు ప్రయాణించే పక్షుల్లో ఒకటైన బార్‌హెడ్ గూస్‌పక్షులు తురిమెళ్లకు చేరుకున్నాయి. ఈ పక్షులు శీతాకాలంలో సంతాన ఉత్పత్తి సమయంలో దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాలకు వలస వెళ్తుంటాయి. గుడ్లు పెట్టిన తర్వాత 56 రోజులు పొదిగి సంతానోత్పత్తి చేస్తాయని, తర్వాత వాటి పిల్లలు ఎగిరే సామర్థ్యంగా వచ్చాక స్థిర నివాసాలకు వెళ్లిపోతాయి. గతంలో కూడా తురిమెళ్ల చెరువులో పలు విదేశీ పక్షులు సందడి చేశాయని తురిమెళ్లకు చెందిన పక్షి ప్రేమికుడు బెల్లం కొండసాయి తెలిపారు. విదేశీ పక్షులు తురిమెళ్లలో సందడి చేస్తుండటంతో చుట్టుపక్కల ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.



ఆహారం తింటున్న పక్షులు

ఖోఖో కింగ్స్..!

స్మార్ట్ ఫోన్..స్మార్ట్ ఫోన్..నర్సరీ నుంచి పీజీ విద్యార్థుల వరకు అందరూ దానికి బానిసలే. నిద్ర లేచిన దగ్గర నుంచి మళ్లీ రాత్రి నిద్రించే వరకు కాలక్షేపం అంతా ఫోన్‌లోనే..ఇక పాఠశాలల్లో ఆటలకు స్థానం ఎక్కడ..? కానీ కనిగిరి మండలం కంచర్లవారిపల్లి విద్యార్థులు మాత్రం అందుకు భిన్నం. ఖోఖో ఆటను కంచర్లవారిపల్లికి అడ్డాగా మార్చేశారు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు సత్తా చాటుతూ ప్రశంసలు పొందుతున్నారు. క్రమశిక్షణ, పట్టుదల..లక్ష్య సాధనతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి మేటిగా నిలుస్తున్నారు.

- ఖోఖోలో కంచర్లవారిపల్లి విద్యార్థుల సత్తా
- జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ
- పల్లె నుంచి జాతీయస్థాయికి..
- భూపాల్‌లో జరిగే జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఖోఖో శిక్షణలో కంచర్లవారిపల్లి విద్యార్థులు

కనిగిరిరూరల్: మండలంలోని కంచర్లవారిపల్లి గ్రామం ఖోఖోకు గుర్తింపుగా నిలుస్తోంది. ఈ గ్రామంలో ఇప్పటి వరకు 15 మంది క్రీడాకారులు జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక కావడం విశేషం. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎదిగి ఖోఖోలో కింగ్స్‌లో నిలుస్తున్నారు.

ప్రత్యేక పర్యవేక్షణలో

నిత్యసాధకుడైన పీడీ, ఖోఖో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి భవనం కాశిరెడ్డి శిక్షణలో, పర్యవేక్షణలో కంచర్లవారిపల్లి పాఠశాల నుంచి వందలాది మంది విద్యార్థులు ఖోఖో క్రీడాకారులుగా తయారవుతున్నారు. ఈయన సాధనలో కొందరు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపులు సాధించగా, మరి కొందరు క్రీడా రంగంలోనే ఉద్యోగాలను కూడా పొందారంటే అతిశయోక్తి కాదు. గత నెల 23 నుంచి 25 వరకు పల్నాడు జిల్లా కారంపుడిలో రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడా పోటీలు జరిగాయి. పోటీల్లో అండర్- 14 (0-14) విభాగంలో జిల్లా బాలుర జట్టు ద్వితీయ స్థానం సాధించారు. ఆ జట్టులోని మొత్తం 12 మంది క్రీడా కారుల్లో.. ఆరుగురు కనిగిరి మండలం కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులే కావడం విశేషం. అలాగే కంచర్లవారిపల్లి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గోపవరపు సాయి సందీప్ బాలుర విభాగంలో, 7వ తరగతి విద్యార్థిని మందాది వర్షిణీ బాలికల విభాగంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పీడీ కాశీ విశ్వనాథరెడ్డి, హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. వీరిద్దరూ డిసెంబర్‌లో మధ్యప్రదేశ్‌లో భూపాల్‌లో జరిగే జాతీయస్థాయి ఖోఖో క్రీడల్లో రాష్ట్ర జట్టు తరుపున పాల్గొననున్నారు.

జాతీయస్థాయికి 15 మంది

కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఇప్పటి వరకు 15 మంది జాతీయ స్థాయి అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ఖోఖో పోటీల్లో ఆడారు. పూర్వ విద్యార్థులైన పి బాబునారాయణ, పి.నందిని, బి. నాగేష్, ఎం సఖియా, ఎం సుమతి, కె.అఖిల, బి.నందకిషోర్, కె.మజోజ్, బి.కళ్యాణి, పి.శ్రీజ, యు రేఖ, ఎం శేషుబాబు, పి.ఇంద్ర సేనారెడ్డిలతో పాటు ఈ ఏడాది కె.వెంకటసాయి, ఎస్ భానుప్రియ, జి.సాయి సందీప్, ఎం వర్షిణీలు జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు.

కంచర్లవారిపల్లికి ఎన్నో గుర్తింపులు

- కంచర్లవారిపల్లి పాఠశాలలో 2018-2024 వరకు ఖోఖో క్రీడాకారులు 220 మంది తయారు కాగా, అందులో రాష్ట్రస్థాయిలో 150 (బాల, బాలికలు) స్కూల్ గేమ్స్, అసోసియేషన్ పోటీల్లో ఆడారు.
- జాతీయ స్థాయిలో (పాఠశాల పూర్వ విద్యార్థులు) పాముల బాబు నారాయణ(కంచర్లవారిపల్లి), ఈర్ల నందకిషోర్(తక్కెళ్లపాడులు) బ్రాంజ్ మెడల్స్ సాధించారు.
- రాష్ట్రస్థాయిలో ఏడుగురు బంగారు పతకాలు, నలుగు సిల్వర్ మెడల్స్ సాధించారు.
- బ్రాంజ్ మెడల్స్ 20 మంది సాధించారు.
- 190 మంది జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు.

జట్టును విజయ పథంలో నడిపిస్తాం



రాష్ట్రజట్టును జాతీయ స్థాయిలో విజయపథంలో నడిపించేందుకు కృషి చేస్తా. డిసెంబర్‌లో మధ్యప్రదేశ్‌లోని భూపాల్‌లో జరిగే జరిగే జాతీయ ఖోఖో క్రీడల్లో అండర్ 14 విభాగంలో ఆడుతున్నాం. జాతీయ స్థాయిలో ఆడే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రతి రోజు శిక్షణ తీసుకుని ప్రతిభ చాటుతా.

– గోపవరపు సాయి సందీప్ (జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి)

రోజు సాధన చేస్తాం



కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతి రోజు ఖోఖో క్రీడలను పీడీ కాశివిశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో సాధన చేస్తాం. ఖోఖోలో మా పాఠశాల నుంచి చాలా మంది ఇప్పటికే ప్రతిభ చాటారు. తాజాగా అండర్ 14 విభాగంలో ఏపీ జట్టుకు ఎంపికయ్యాను. జాతీయ స్థాయిలో ఆడే అవకాశం రావడం సంతోషంగా ఉంది. నిత్యం సాధన చేసి, మంచి విజయాన్ని సాధిస్తాం. పాఠశాలకు పేరు తీసుకువస్తాం.

– మందాది వర్షణి (జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని)

ఎంతో మంది ఖోఖో క్రీడాకారులను తీర్చిదిద్దా



కంచర్లవారిపల్లిలో హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ కమిటీ, గ్రామ పెద్దల సహకారంతో ఖోఖో కమిటీ ప్రోత్సాహంతో ఎంతో మంది క్రీడాకారులను తీర్చిదిద్దా. వందలాది మంది అండర్ 14, 17 విభాగంలో జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఆడారు. సుమారు 15 మంది వరకు జాతీయ స్థాయిలో ఆడారు. బ్రాంజ్ మెడల్స్ కూడా జాతీయ స్థాయిలో సాధించారు. మరో ఇద్దరు అండర్ 14 విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబర్‌లో మధ్య ప్రదేశ్‌లో జరిగే పోటీల్లో వీరు ఆడనున్నారు.

– భవనం కాశీ విశ్వనాథరెడ్డి, పీడీ, ఖోఖో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి)





క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న పీడీ కాశీ విశ్వనాథరెడ్డి



కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల

3న దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించాలి

ఒంగోలు సిటీ: జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ నెల 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించాలని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ తెలిపారు. దివ్యాంగుల దినోత్సవంలో భాగంగాలో వివిధ కేటగిరీల్లో దివ్యాంగులకు ఆటల పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయాలన్నారు. కార్యక్రమ నిర్వహణకు ఇప్పటికే బడ్జెట్ విడుదలైందని, విధి విధానాలను మండల కేంద్రాలకు పంపించినట్లు తెలిపారు. భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న రిసోర్సుపర్సన్లు పోటీలు, ఇతర కార్యక్రమాల నిర్వహణలో పాల్గొనాలని, ఎంఈఓలు వారికి తగు ఆదేశాలు జారీ చేయాలని ఆదేశించారు. హైస్కూల్లో పనిచేస్తున్న స్పెషల్ టీచర్లు కూడా కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఫొటోలు, డాక్యుమెంటేషన్ ప్రతి మండలం నుంచి జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి పంపాలన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

టంగుటూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని తూర్పునాయుడుపాలెం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. జాతీయ రహదారి పోలీసులు తెలిపిన వివరాల మేరకు..ఒంగోలు వైపు నుంచి నెల్లూరు వెళ్లే గుర్తుతెలియని వాహనం రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి కాకీ రంగు ఫ్యాంట్, ఎరుపు చొక్కా ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

● 10 మందికి గాయాలు

కురబలకోట: కనిగిరి నుంచి బెంగళూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కురబలకోట రైల్వే స్టేషన్ ఫ్లైఓవర్ (ఆర్ ఓబీ) వద్ద ఆదివారం వేకువజామున ప్రమాదవశాత్తు బోల్తా పడింది. అదృష్టవశాత్తు బస్సులోని ప్రయాణికులు గాయాలతో బయటపడ్డారు. ప్రాణాపాయం తప్పింది. ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్, ఆర్టీసీ అధికారుల కథనం మేరకు..కనిగిరి నుంచి బెంగళూరుకు ఆర్టీసీ బస్సు వెళ్తుండగా కురబలకోట రైల్వే స్టేషన్ ఫ్లై ఓవర్‌పై ఆదివారం వేకువజామున రెండు గంటల ప్రాంతంలో వెనుక వచ్చిన కారు బస్సును ఓవర్ టేక్ చేసి ముందుకు వచ్చింది. ముందు వెళ్తున్న కారు ఉన్నట్టుండి కుడి పక్కకు తిరిగింది. దీంతో వెనుక వస్తున్న కనిగిరి ఆర్టీసీ బస్సు డ్రైవర్ కారును తప్పించే క్రమంలో పక్కకు తిప్పాడు. దీంతో ప్రమాదవశాత్తు కారును ఢీకొని పక్కకు దూసుకెళ్లి అదుపు తప్పి బస్సు బోల్తా పడింది. బస్సులో 24 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో పది మంది గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. బెంగళూరుకు చెందిన చిన్నయ్య (58), కొండమ్మ (49), వెంకటరమణ (43), కనిగిరికి చెందిన లేయమ్మ (56), సారమ్మ (57), మాల కొండయ్య (69) పుల్లమ్మ (46) శ్రీనివాసులు 35) తదితరులు గాయపడిన వారిలో ఉన్నారు. వీరిలో చిన్నయ్య, కొండమ్మ, ఎం. కొండయ్య తలకు తీవ్ర గాయాలు కావడంతో బెంగళూరు ఆసుపత్రికి రెఫర్ చేశారు. కారు డ్రైవర్ కోసువారిపల్లెకు చెందిన బావాజీ (38) కూడా గాయపడి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా బస్సు ఫ్లై ఓవర్ కిందకు వచ్చాక ప్రమాదం జరిగింది. ఫ్లై ఓవర్ పైన బోల్తా పడి ఉంటే ఘోర ప్రమాదం జరిగి ఉండేది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కనిగిరి, మదనపల్లె డిపో ఆర్టీసీ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



కురబలకోట రైల్వే స్టేషన్ ఫ్లై ఓవర్ వద్ద బోల్తాపడిన కనిగిరి ఆర్టీసీ బస్సు



బస్సు బోల్తా సంఘటనలో గాయపడిన ప్రయాణికులు



గాయపడిన వారిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

గ్రామీణ యువతుల్లో ఆలోచన రేకెత్తించే యోధ

● ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ కమిటీ సభ్యురాలు రాజ్యలక్ష్మి



మాట్లాడుతున్న కవి శ్రీరామ కవచం సాగర్

ఒంగోలు సిటీ: గ్రామీణ యువతుల్లో ఆలోచన రేకెత్తించి వారిని భవిష్యత్తు తరాల యోధలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ కమిటీ సభ్యురాలు పి.రాజ్యలక్ష్మి చెప్పారు. ఒంగోలు నగరంలోని ఎంసీఐ భవనంలో ఆదివారం యోధ కథాసంపుటి పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ కట్టుబాట్లు, సంప్రదాయాలు విసురుతున్న అనేక సవాళ్ల మధ్య అసలు మహిళగా జీవించడమే ఒక గొప్ప సవాల్‌గా మారిందన్నారు. ఆధునిక జీవితంలో చొరబడిన సాంకేతికతను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. 53 మంది రచయిత్రులు రచించిన ఈ కథల్లో ఒకప్పుడు హేళనకు గురైన అంశాలను సమర్థవంతంగా చర్చకు పెట్టారన్నారు. యోధ సంపాదకురాలు బండారు విజయ మాట్లాడుతూ అమ్మతనం వెనక ఉన్న శారీరక, మానసిక హింసలను యోధ పుస్తకం వెలికి తీసిందన్నారు. నిజ జీవితంలో ఎదురయ్యే ఘటనలనే కథలుగా తీర్చిదిద్దారన్నారు. మహిళలు పిల్లల్ని కనే యంత్రాలు మాత్రమే కాదని, వారికి సమాన స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. మహిళలకు ఎలాంటి సానుభూతి అక్కరలేదని, సహానుభూతి కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. హిజ్రాలను థర్డ్ జెండర్‌గా పిలుస్తున్నారని, మరి ఫస్ట్, సెకండ్ జెండర్లు ఎవరో చెప్పాలని ప్రముఖ కథా రచయిత్రి పాలపర్తి జ్యోతిష్మతి ప్రశ్నించారు. నల్లూరి క్రాంతి నిర్వహణలో నిర్వహించిన ఈ సభలో కవి శ్రీరామ కవచం సాగర్, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం గౌరవ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ కథలను సమీక్షించారు. ఏ.ఆంజనేయులు, మందవరపు హైమావతి, జనసాహితి కార్యదర్శి ప్రసన్న, బారహంతుల్లా, చందలూరి నారాయణ, తదితరులు ప్రసంగించారు. ప్రజా కళామండలి గాయకుడు కోటి ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. బొమ్మరిల్లు ఖాసీం వందన సమర్పణ చేశారు.

ఐదు నెలల్లో 25 సార్లు తనిఖీ



రేషన్ డీలరు పై అక్రమ కేసు నమోదు చేయిస్తున్న గ్రామ నాయకుడు

● పచ్చనేతల మెప్పుకోసం అధికారుల పాట్లు

ముండ్లమూరు(దర్శి): ఒకటి కాదు..రెండు సార్లు ఏకంగా 25 సార్లు తనిఖీ..దేశ చరిత్రలో ఓ రేషన్ దుకాణంపై ఇన్ని సార్లు తనిఖీ చేసిన సందర్భం బహుశా ఉండదు కాబోలు. ఒక్క రేషన్‌షాపు డీలర్‌ను తొలగించేందుకు టీడీపీ నేతలు అధికారులను అడ్డం పెట్టుకొని 25 సార్లు తనిఖీల పేరుతో వేధించిన తీరును స్థానిక ప్రజలు సైతం ఛీదరించుకుంటున్నారు. మండలంలోని కమ్మవారి పాలెం రేషన్‌డీలర్ గోళ్ల వెంకట రమణను ఎలాగైనా తొలగించాలని ఇప్పటికే 24 సార్లు తనిఖీ చేశారు. ఇన్ని సార్లు తనిఖీ చేసినా ఒక్క చిన్న తప్పు కూడా డీలర్ వద్ద కనిపించకపోవడంతో కేసు నమోదు చేయలేకపోయారు. దీంతో ఈసారి ఎలాగైనా కేసు నమోదు చేయాలనే ఉద్దేశంతో ఆదివారం తహసీల్దార్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆర్ఐ మూర్తి వీఆర్వోతో కలిసి 25వ సారి రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రేషన్ షాపులో సరుకులు సక్రమంగా వుండటంతో రేషన్‌సరుకులు అందజేస్తున్న వాహనం వద్దకు వెళ్లి ఇద్దరు కార్డుదారులను సరుకులు తీసుకోకుండా వేలిముద్రలు వేయాలని సైగచేసి వారిని పక్కకు పంపి ఆ స్టాకు అదనంగా ఉన్నట్లు రికార్డు చేసి 6ఏ కేసు నమోదు చేశారు.

45 కిలోల బియ్యం, 5 ప్యాకెట్లు చక్కెర, 2 ప్యాకెట్లు కందిపప్పు అక్రమంగా వున్నట్లు చూపి కేసు నమోదు చేశారు. లారీలకు లారీలు బియ్యం అక్రమంగా మిల్లులకు చేరుతున్నా పట్టించుకోని అధికారులు కేవలం ఒక్క డీలర్ కోసం 25 సార్లు తమ సమయాన్ని కేటాయించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ తనిఖీ సమయంలో సదరు టీడీపీ నాయకున్ని అధికారులు వెంట పెట్టుకొని రావడం విశేషం.

విద్యుత్ భారాలు ప్రభుత్వమే భరించాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

ఒంగోలు సిటీ: ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాలను ప్రభుత్వమే భరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సీపీఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్. వెంకటరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే ఎటువంటి విద్యుత్ భారాలు మోపమని హామీ ఇచ్చిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయడం దారుణమన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారా ప్రజలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారని, ఆ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరి వ్యవసాయ పంటలకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజలపై ఎటువంటి భారాలు వేయకూడదని కోరారు. వెలిగొండ ప్రాజెక్టును నీటి పారుదల శాఖ మంత్రి సందర్శించిన ఉపయోగం లేదన్నారు. బడ్జెట్‌లో పూర్తిస్థాయి నిధులు కేటాయించలేదన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తిస్థాయి నిర్మాణానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహించే సీపీఐ శతాబ్ది ఉత్సవాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు పార్టీలోని ప్రతి కార్యకర్త పాటుపడాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.శ్రీనివాస్, అందే నాసరయ్య, ఎం.రమేష్, కె.వీరారెడ్డి, వి.హనుమారెడ్డి, ఎస్.రావమ్మ, ఆర్.రామకృష్ణ, ఎం.విజయ, ఎస్‌డీ మౌలాలి, పి.ప్రభాకర్, నల్లూరి మురళి, సీపీఐ మండల కార్యదర్శులు, ప్రజా సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.